శుక్రవారం సిద్దిపేటలోని శ్రీనగర్ కాలనీలో హోలీ సంబురాల్లో మహిళలు, చిన్నారులు

నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, శనివారం 15 మార్చి 2025 | SIDDIPET

సీఎం రేవంత్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

దుబ్బాక, మార్చి 14: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డిపై ఫిర్యాదు చేశారు. కేసీఆర్‌పై సీఎం రేవంత్ దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆస స్వామి, పర్స కృష్ణ, మల్లేశంగౌడ్ తదితరులున్నారు.

దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సర్కారు పాపం.. అన్నదాతకు శాపం

- యాసంగిలో తగ్గిన సాగు విస్తీర్ణం
- వెలవెలపోతున్న దేవాదుల కాల్వలు
- కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన కరువుతో లబోదిబోమంటున్న రైతులు
- తపాస్‌పల్లికి గోదావరి జలాలు పంపింగ్ చేయకపోవడంతో చేర్యాలలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు
- అన్నిగ్రామాల్లో రోజురోజుకూ అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- పంటలను రక్షించుకునేందుకు నిత్యం పదుల సంఖ్యలో బోర్లు వేస్తున్న అన్నదాతలు
- 800 ఫీట్ల వేసినా చుక్క నీరు పడని పరిస్థితి

కేసీఆర్ పాలనలో కళకళలాడిన చేర్యాల ప్రాంతం కాంగ్రెస్ పాలనలో విలవిలలాడుతోంది... కరువు ప్రాంతమైన చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో పంటలు ఎండిపోకుండా సర్కారు ముందస్తు చర్యలు తీసుకోక పోవడంతో అన్నదాతకు శాపంగా మారింది. నెల రోజులుగా చేర్యాల ప్రాంతంలో సుమారు 1000 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. పదేండ్లుగా ఎండిపోని పంటలు కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన కరువుతో రైతులు లబోదిబోమంటున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు పంపింగ్ చేయకపోవడంతో చేర్యాల ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇప్పటికే వేలాది బోర్లు ఎండిపోవడంతో చేర్యాల ప్రాంతంలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. మరో రెండు నెలలు ఎండాకాలం ఉండడంతో తాగునీటికి సైతం ప్రజలు తిప్పలు పడే పరిస్థితి నెలకొంది. పదేండ్లుగా పచ్చని పంటలతో కళకళలాడిన చేర్యాల ప్రాంతం ప్రస్తుతం కరువు కోరల్లో చిక్కుకుంది. పంటలను రక్షించుకునేందుకు రైతులు నిత్యం పదుల సంఖ్యలో బోర్లు వేసుకుంటున్నారు. 600 ఫీట్ల నుంచి 800 వరకు బోర్లు వేసినా చుక్క నీరు రావడం లేదని బోరుబండి యజమానులు తెలుపుతున్నారు. ఇలాంటి పరిస్థితి తాము ఎన్నడూ చూడలేదని బోరుబండి నిర్వాహకులు అంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

చేర్యాల ప్రాంతంలో వేయి ఎకరాల్లో ఎండిపోయిన వరి పంట

వెలవెలబోతున్న దేవాదుల కాల్వ

చేర్యాల, మార్చి 14: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లో 2023-24 యాసంగిలో చేర్యాలలో 21,960 ఎకరాల 11గుంటలు, ధూళిమిట్టలో 10,472 ఎకరాల 26 గుంటలు, కొమురవెల్లిలో 11,212 ఎకరాల 12 గుంటలు, మద్దూరులో 10,044 ఎకరాల 6 గుంటల్లో వరి సాగు చేశారు. 2024-25 యాసంగి సీజన్‌లో చేర్యాలలో 11,881 ఎకరాల 37 గుంటలు, ధూళిమిట్టలో 7,446 ఎకరాల 29 గుంటలు, కొమురవెల్లిలో 3,737 ఎకరాల 7గుంటలు, మద్దూరులో 4,603 ఎకరాల 15 గుంటల్లో రైతులు వరిసాగు చేశారు. గత యాసంగిలో 43,654 ఎకరాల్లో వరిపంట సాగు చేస్తే, ఈసారి 27,667 ఎకరాల్లో సాగు చేశారు. రెండు యాసంగి సీజన్లలో పోలిస్తే సాగు విస్తీర్ణం 15,987 పడిపోయింది. చేర్యాల ప్రాంతంలో ఇప్పటివరకు గ్రామాల వారీగా రైతుల నుంచి సేకరించిన వివరాల మేరకు దాదాపు చేర్యాల్లో మండలంలోని 18 గ్రామాల్లో 400 ఎకరాలు, కొమురవెల్లి మండలంలోని 11 గ్రామాల్లో 150 ఎకరాలు, మద్దూరు 10 గ్రామాల్లో 200, ధూళిమిట్ట మండలంలోని 11 గ్రామాల్లో 250 ఎకరాల్లో వరి పంట ఇప్పటి వరకు ఎండిపోయినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. తపాస్‌పల్లికి గోదావరి జలాలు ఇచ్చి కాల్వల నుంచి చెరువులకు నీటిని పంపింగ్ చేస్తే మిగిలిన పంటలు కాపాడుకునే అవకాశం ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ముమ్ముందు వందలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయే అవకాశం ఉంది.

తపాస్‌పల్లిని పట్టించుకోలేదు...

కరువు ప్రాంతంగా పేరున్న చేర్యాల ప్రాంతాన్ని అన్నివిధాలుగా ఆదుకునేందుకు నాటి పాలకులు చొక్కరావు ఎత్తిపోతల పథకంలో భాగంగా చేర్యాల ఉమ్మడి మండలంలో తపాస్‌పల్లి, ఐనాపూర్ గ్రామాల మధ్య 0.3టీఎంసీ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మించారు. దేవాదుల నుంచి ధర్మసాగర్, గండిరామారం, బొమ్మకూరు రిజర్వాయర్ల నుంచి నేరుగా తపాస్‌పల్లికి రెండు పైపుల్లో నీటిని ప్రతి ఏడాది పంపింగ్ చేసేవారు. 68వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు నిర్మించిన తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి రెండు దశల్లో చెరువులు నింపడంతో బోరుబావుల్లో నీటి మట్టం పెరిగి విస్తారంగా పంటలు పండాయి. ఈ ఏడాది దేవాదుల నుంచి తపాస్‌పల్లికి నీళ్లు రావడమే పెద్ద సమస్యగా మారింది. దేవాదుల పథకంలో టెయిల్ ఎండ్‌లో ఉన్న తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ మేరకు కొన్ని రోజులపాటు నామమాత్రంగా నీటిని పంపింగ్ చేశారు. తర్వాత పైపులు పగిలిపోయాయి, మోటర్లు సతాయిస్తున్నాయనే సాకులతో పంపింగ్ చేయడం నిలిపేశారు. దీంతో రిజర్వాయర్‌లో నీరు డెడ్ స్టోరేజీకి వెళ్లిపోవడంతో భూగర్భజలాలు తగ్గి పంటల ఎండిపోతున్నాయి.

మోటర్లు ఆన్ చేసి నీటిని పంపింగ్ చేయాలి

అధికారులు మోటర్లు ఆన్ చేసి దేవాదుల నీటిని తపాస్‌పల్లికి పంపింగ్ ప్రారంభించాలి. గ్రామాల వారీగా యుద్ధ ప్రాతిపదికన సర్వే నిర్వహించి, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.20వేలు అందించాలి. రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించకపోవడంతో పాటు తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను పంపింగ్ చేయకపోవడంతో చేర్యాల ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగుంటి పంటలు ఎండిపోయాయి. ఇప్పటికైనా సర్కారు స్పందిస్తే వేల ఎకరాల్లో పంటలను కాపాడుకోవచ్చు. పలుమార్లు తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయాలని అధికారులతో మాట్లాడడమే కాకుండా వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశా. గతేడాది ఇదే సీజన్‌తో పోలిస్తే వేలాది ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రభుత్వానికి ముందస్తు ఆలోచన లేకపోవడం, తపాస్‌పల్లికి గోదావరి జలాలు తరలించకపోవడంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రైతులకు పంట నష్టపరిహారం అందించే విషయంలో అసెంబ్లీలో ప్రస్తావించి, అన్నదాతలకు పరిహారం వచ్చే వరకు పోరాటం చేస్తా.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

మద్దూరు(ధూళిమిట్ట): లద్నూర్‌లో ఎండిన పొలంలో పశువులను మేపుతున్న రైతు

చేర్యాల మండలం వేచరేణిలో ఎండిపోయిన ఎర్రకుంట

పాత తేదీల్లో పర్మిషన్లు!

- అందినకాడికి దండుకుంటున్న ఈవోలు
- మున్సిపాలిటీల ఆదాయానికి గండి
- అసైన్డ్ భూముల ఆక్రమణలకు అసిస్మెంట్ నంబర్లు జారీ
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్, తెల్లాపూర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీలో జోరుగా దందా
- ముత్తంగి, బీరంగూడలో తిష్టవేసిన పాత కార్యదర్శులు
- విషయం తెలిసినా కండ్లు మూసుకున్న టౌన్‌ప్లానింగ్ విభాగం

సొమ్ము చేసుకుంటున్న అప్పటి కార్యదర్శులు

తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి వార్డు కార్యాలయం

పటాన్‌చెరు, మార్చి 14: అమీన్‌పూర్, తెల్లాపూర్, ఇస్నాపూర్, మున్సిపాలిటీల్లో ఇప్పుడు, ఒకప్పటి కార్యదర్శులకు బంగారు రోజులు వచ్చాయి. పెద్దఎత్తున అక్రమ దందా కొనసాగుతున్నది. కృష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, ముత్తంగి, పాటి, ఘనపూర్, ఇస్నాపూర్, చిట్కుల్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీల్లో విలీనం అయ్యాయి. అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలు దాదాపు ఐదేండ్ల క్రితం ఏర్పాటు కాగా, ఇస్నాపూర్, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలు ఈ మధ్య కాలంలో ఏర్పాటయ్యాయి. గ్రామ పంచాయతీల నుంచి మున్సిపాలిటీల్లోకి విలీనం కాగానే కొందరు అప్పటి కార్యదర్శులకు కలిసి వస్తున్నది. ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేసి వెళ్లిపోయిన కార్యదర్శులు కొత్తగా ఇండ్ల పర్మిషన్లు ఇస్తున్నారు. విలీన సమయంలో ఉన్న కార్యదర్శులను మున్సిపాలిటీల్లోనే ఉద్యోగులుగా అపాయింట్ చేశారు. గతంలో పనిచేసి వెళ్లిన వారు పాత తేదీల్లో పర్మిషన్లు ఇచ్చి అక్రమంగా ఆర్జిస్తున్నారు. మున్సిపాలిటీల్లో కొత్త పర్మిషన్లకు రెట్టింపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆయా పంచాయతీల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఉన్నా, ఆ కాలంలో కార్యదర్శులు ఆఫ్‌లైన్ పర్మిషన్లే ఇచ్చేవారు. స్టాంపులు, రసీదు బుక్కులు, రిజిస్టర్ల కాపీలు, ఇతర పర్మిషన్ పత్రాలు ఈ కార్యదర్శుల వద్ద అదనంగా ఉన్నాయి. గ్రామాల్లో వీరికి అసిస్టెంట్లుగా పని చేసిన కారోబార్లు, బిల్ కలెక్టర్లు, చిరుద్యోగులు, మాజీ ప్రజాప్రతినిధులు ఇప్పటికీ వీరికి బేరాలు తెస్తున్నారు. మున్సిపాలిటీలో గృహం నిర్మించేందుకు దరఖాస్తు కోసం వచ్చిన వారిని పక్కదారి పట్టించి పాత తేదీల్లో ఇంటి పర్మిషన్లు ఇప్పిస్తున్నారు. ఇలా వచ్చిన పర్మిషన్లను పన్నుల చెల్లింపు సమయంలో చిరుద్యోగుల సహాయంతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇప్పుడు ముత్తంగి, చిట్కుల్, పటేల్‌గూడ, కృష్టారెడ్డిపేట్, ఇస్నాపూర్, పాటి, ఘనపూర్‌లలో పంచాయతీ పర్మిషన్ల పేరున భారీగా నిర్మాణాలు జరుగుతున్నాయి. కమర్షియల్ నిర్మాణాలకు అక్రమ పర్మిషన్లు ఇస్తున్నారు. లావణి పట్టాలో నిర్మాణాలకు, స్థలాల రెగ్యులరైజ్ కోసం పాత తేదీల్లో పంచాయతీ కార్యదర్శులు గ్రామ కంఠం ఆబాది అని పర్మిషన్లు ఇస్తున్నారు. ఆ ఆసిస్మెంట్ నెంబర్ ఆధారంగా మున్సిపాలిటీల్లో పీటిన్ నెంబర్‌కు దరఖాస్తు చేస్తున్నారు. వీటి ఆధారంగానే మున్సిపాలిటీల్లో పన్నులు తీసుకొని రసీదులు, వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. వివాదంలో ఉన్న ప్లాట్లు, ఇతర నిర్మాణాలకు కక్కుర్తిపడి పాత కార్యదర్శులు ఇస్తున్న పర్మిషన్లు మరొకరికి వరంలా మారుతున్నది. ఈ వెసులుబాటు చూసి పేద, మధ్య తరగతి వారి ప్లాట్లను కబ్జా చేసి బలవంతంగా ఇండ్లను నిర్మించే సంస్కృతి ప్రారంభమైంది.

అపార్ట్‌మెంట్లకు పర్మిషన్లు

ముత్తంగి, పటేల్‌గూడ, కృష్టారెడ్డిపేట్, ఘనపూర్, ఇస్నాపూర్‌లలో జోరుగా అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. పంచాయతీల్లో జీ ప్లస్ టు పేరున పర్మిషన్లు తీసుకొని జీ ప్లస్ ఫోర్ వేస్తున్నారు. ఐదంతస్తుల నిర్మాణాలు భారీగా జరుగుతున్నాయి. కొత్తగా మున్సిపాలిటీల్లో విలీనం అయిన గ్రామాల్లో జరుగుతున్న అక్రమ పర్మిషన్ల దందా మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగానికి అర్థంకాని పరిస్థితి. పర్మిషన్లు తక్కువ, నిర్మాణాలు ఎక్కువ అన్నట్లుగా పరిస్థితి ఉంది. మున్సిపాలిటీల్లో ట్యాక్స్ ఎక్కువ అనే భయం ప్రజల్లో ప్రచారం చేసి, బదిలీపై వెళ్లిన పాత కార్యదర్శులు పాత తేదీల్లో పర్మిషన్లు మంజూరు చేస్తున్నారు. పంచాయతీల్లోనూ పర్మిషన్లు ఇచ్చే అధికారం హెచ్ఎండీఏకు ఉన్నా, పంచాయతీ కార్యదర్శులే పర్మిషన్లు ఇచ్చారు. ఇప్పుడు మున్సిపాలిటీలుగా పలు మేజర్ పంచాయతీలు కాగానే అనుమతులు ఇచ్చేందుకు నాటి పంచాయతీ కార్యదర్శులు తెలివిగా పావులు కదిపారు. ఇప్పుడు ముత్తంగిలో, బీరంగూడలో, సంగారెడ్డిలో పనిచేసి వేరే పంచాయతీలకు వెళ్లిన కార్యదర్శులు రూంలు అద్దెకు తీసుకుని దుకాణాలు తెరిచారు. రహస్యంగా పర్మిషన్లు ఇస్తూ మున్సిపల్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. మున్సిపల్ ఉద్యోగులు నిర్మాణాల వద్దకు వెళ్లి పాత పర్మిషన్లు చూసి వెనుదిరుగుతున్నారు. పైగా స్థానికంగా పలుకుబడి ఉన్న నాయకులు ఫోన్లు చేసి బెదింపులకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు పంచాయతీల్లో పనిచేసి వెళ్లిపోయిన కార్యదర్శులు బదిలీ అయినచోట ఉండకుండా ఈ మున్సిపాలిటీల్లో తిష్ట వేసి విలీనం అయిన పంచాయతీల వద్ద అక్రమ అనుమతులు ఇస్తున్నారని అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. పంచాయతీల్లో పర్మిషన్ల నకలు కాపీలు ఉండట్లేదు. పర్మిషన్ల వివరాలు లేనివన్నీ అక్రమ నిర్మాణాలుగా పరిగణించవచ్చు. ఇప్పటికైనా ఈ అక్రమ దందాకు జిల్లా అధికారులు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో సర్కారు భూములకు ఇచ్చిన అక్రమ పర్మిషన్ పత్రాలు కబ్జాకోరులకు వరంలా మారే అవకాశం ఉంది.

చిరుత దాడిలో దూడలు మృతి

రామాయంపేట రూరల్, మార్చి 14: చిరుత దాడిలో రెండు దూడలు చనిపోయిన ఘటన రామాయంపేట మండలం దంతేపల్లి శివారులో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. రైతు నక్కిర్తి స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తన పొలంవద్ద పశువులను కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. ఉదయం వెళ్లి చూడగా రెండు దూడలు చనిపోయినట్లు తెలిపారు. చిరుత దాడి వల్లే దూడలు చనిపోయాయని తెలిపారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. రాత్రి వేళల్లో రైతులు పంట పొలాల వద్దకు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

హెచ్ఎండీఏలోకి ఐదు గ్రామాలు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- పెరగనున్న భూముల ధరలు

చౌటకూర్, మార్చి 14: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలోని ఐదు గ్రామాలను హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో చేరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్ఎండీఏ పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం 68 జీవో జారీ చేసింది. బీఆర్ఎస్ హయాంలో పుల్కల్ మండలం నుంచి 2020లో చౌటకూర్ మండలాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటైన చౌటకూర్ మండలంలోని శివంపేట, వెండికోలు, వెంకటకిష్టాపూర్, లింగంపల్లి, కోర్పోల్ గ్రామాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకువస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఆయా గ్రామాల శివారు భూముల గుండా రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి బీజం పడటంతో అందుకనుగుణంగా హెచ్ఎండీఏ పరిధిని ప్రభుత్వం విస్తరించింది. రీజినల్ రింగ్ రోడ్డు ప్రారంభానికి ముందే హెచ్ఎండీఏ పరిధిని ప్రభుత్వం విస్తరిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకోనున్నది. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని వ్యవసాయ భూములకు విపరీతమైన డిమాండ్ ఉన్నది. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో భూమి ధర మరింతగా పెరగనున్నది. చౌటకూర్ మండలం మీదుగా సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 నాలుగు లైన్ల జాతీయ రహదారి ఉండటంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రైవేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇప్పటికే ఓఆర్ఆర్ చుట్టూ బహుళ అంతస్థుల భవన నిర్మాణాలు కొనసాగుతుండగా, భవిష్యత్తులో ఆర్ఆర్ఆర్ చుట్టూ పెద్దఎత్తున నిర్మాణాలు జరగనున్నాయి. ఇప్పటికే ఎకరం భూమి ధర రూ.కోటిన్నర నుంచి మూడు కోట్ల వరకు పలుకుతున్నది. భవిష్యత్తులో ఆ ధర మరింత రెట్టింపయ్యే అవకాశాలు లేకపోలేదు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అప్రజాస్వామికం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మార్చి 14: ప్రభుత్వ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సెషన్ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ చేయడం అప్రజాస్వామికమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గవర్నర్ ప్రసంగంపై జగదీశ్‌రెడ్డి కాంగ్రెస్ వైఫల్యాలను అసెంబ్లీలో నిలదీస్తుంటే జీర్ణించుకోలేకనే సస్పెండ్ చేశారని, నిండుసభ సాక్షిగా కాంగ్రెస్ వైఫల్యాలపై మాట్లాడితే ప్రజల్లో చులకన అవుతామనే భయంతోనే ఇలాంటి చర్యలను ప్రభుత్వం పూనుకున్నట్లు విమర్శించారు. ఇలాంటి చర్య ముమ్మాటికి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అన్నారు. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును భారత రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించని ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పుతారని పేర్కొన్నారు. జగదీశ్‌రెడ్డి ఏం తప్పు చేశారో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో సాగునీళ్లు లేక రైతుల పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక ఇలాంటి చిల్లర పనులకు ప్రభుత్వం పాల్పడుతున్నట్లు వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెనుకబడిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వందలాది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రోజుకో ఆత్మహత్య చోటుచేసుకుంటున్నా ప్రభుత్వంలో చలనం లేదని వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, మాజీ జడ్పీటీసీ మల్లేశం, మాజీ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బెండె మధు, నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గుంటుక రాజు, గొడుగు స్వామి, అహ్మద్, రవీందర్, కనకయ్య, శ్రీధర్, అంజనేయులు, కల్యాణ్‌కర్ శ్రీను, దయానందరెడ్డి, కరీం, బీరయ్య, లతీఫ్, నరేష్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

హరిత విధ్వంసం

పెద్దగోపులారం శివారులో హరితహారం మొక్కలు ధ్వంసం

అక్రమ మొరం దందాతో మాయమవుతున్న గుట్టలు

పట్టించుకోని అధికారులు

మునిపల్లి, మార్చి 14: కాంగ్రెస్ పాలనలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గుట్టలను, మొక్కలను ధ్వంసం చేస్తూ దందా సాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్దగోపులారం శివారులోని ప్రభుత్వ భూమిలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ హయాంలో హరితహారం కార్యక్రమంలో వందలాది మొక్కలు నాటి సంరక్షించారు. అప్పట్లో మొక్కలు నాటే కార్యక్రమంలో స్వయంగా కలెక్టర్ హనుమంత్‌రావు పాల్గొన్నారు. మొక్కలు నాటిన ప్రాంతం ముంబయి జాతీయ రహదారికి దగ్గరలో ఉండడంతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని అప్పట్లో కలెక్టర్ హనుమంత్‌రావు మునిపల్లి అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మొక్కల సంరక్షణ చేపట్టడంతో ఏపుగా పెరిగాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చాక హరితహారం మొక్కల సంరక్షణను అధికారులు విస్మరించారు. ఇటీవల కొందరు అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతూ గుట్టలను కరిగిస్తూ మొక్కలను ధ్వంసం చేస్తున్నారు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అక్రమార్కులు మొరం దందా కోసం మొక్కలు తొలిగిస్తున్నా మునిపల్లి మండల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. మొక్కలు ధ్వంసం చేస్తూ మొరం అక్రమ దందా సాగిస్తుండడంపై పంచాయతీ కార్యదర్శి అక్తర్‌ను వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు వాటి సంగతి చూసుకుంటారని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

పెద్దగోపులారం శివారులోని హరితవనంలో నాటిన మొక్కలు (ఫైల్)

పెద్దగోపులారం శివారులోని హరితవనం మొక్కలను తొలిగించిన దృశ్యం